క్లుప్తంగా

ఆస్పత్రి, మార్కెట్ భవనాలు ప్రారంభం



శంఖవరంలో పశువుల ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

శంఖవరం: గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ భవనాలను ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. పంచాయతీ నిధులు రూ.30 లక్షలతో నిర్మించిన మార్కెట్ షెడ్ భవనాలు, అలాగే ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.30 లక్షలతో నిర్మించిన పశువుల ఆస్పత్రి భవనానికి ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. మండల పశు వైద్యాధికారి ప్రసాద్, సర్పంచ్ బందిలి గనియమ్మ, ఉప సర్పంచ్ చింతనీడి కుమార్, కొండమూరి చంటిబాబు పాల్గొన్నారు.

సొసైటీ అధ్యక్షుడిగా రుత్తల



కమిటీ సభ్యులను సత్కరించిన వరుపుల సుబ్బారావు

రౌతులపూడి: రౌతులపూడి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడిగా ములగపూడి గ్రామానికి చెందిన రుత్తల సత్యనారాయణను నియమించారు. ఈ మేరకు జిల్లా సహకార శాఖ నుంచి ఉత్తర్వులందాయి. దీంతో వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కోఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు సమక్షంలో రౌతులపూడి సొసైటీ కార్యాలయం వద్ద త్రిసభ్య కమిటీ ప్రమాణం స్వీకారం జరిగింది. డైరెక్టర్లుగా గిడజాం గ్రామానికి చెందిన బండారు బైరాగి, రౌతులపూడి గ్రామానికి చెందిన మాదే పార్వతిని నియమించారు. వారంతా ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. తమను నియమించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వరుపుల సుబ్బారావుకు, త్రిసభ్య కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. కమిటీ సభ్యులకు శాలువాలతో వరుపుల సత్కరించారు. శంఖవరం ఎంపీపీ పర్వత రాజుబాబు, జెడ్పీటీసీ గొల్లు చినదివాణం, పార్టీ ముఖ్య నాయకుడు వాసిరెడ్డి జమీలు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కర బాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు పాల్గొన్నారు.

వైభవంగా స్వామి, అమ్మవార్ల ఊరేగింపు



స్వామి, అమ్మవార్లను పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

గండేపల్లి: మల్లేపల్లిలో ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఏడో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా పల్లకీలో స్వామి, అమ్మవార్లను వైభవంగా గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఆదివారం ఉదయం విఘ్నేశ్వర స్వామి పూజ అనంతరం కలశలను శిరస్సున ధరించి, 108 మంది కన్యకామణులతో జరిగిన ఈ ఊరేగింపులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

స్వేచ్ఛ ఫౌండేషన్ సేవలు భేష్

శంఖవరం: ప్రజలకు స్వేచ్ఛ ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రోగులకు బీపీ, షుగర్, గుండె పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. మానవతా దృక్పథంలో ప్రజలకు సేవలు చేస్తున్న ఫౌండేషన్ సభ్యులను వరుపుల అభినందించారు. ఎంపీపీ పర్వత రాజుబాబు, సంస్థ చైర్మన్ కర్రి గణేష్ పాల్గొన్నారు.

కొత్త యర్రవరంలో వింత జంతువు మృతి!



జంతు కళేబరం

ఏలేశ్వరం: కొత్త యర్రవరం గ్రామంలోని పుంత రోడ్‌లో ఆదివారం వింత జంతువు కళేబరం రైతుల కంటపడింది. దీనిని ముంగిస జాతికి చెందిన సివెట్ క్యాట్‌గా భావిస్తున్నారు. ఇది చెట్లు ఎక్కడంతో పాటు, అరటి చెట్లను, కొబ్బరి చెట్లపై బొండాలను నాశనం చేస్తోందని కొందరు గ్రామస్తులు చెప్పారు. దీనిపై ఫారెస్టు అధికారులను సంప్రదించగా, తమకు సమాచారం అందిందని తెలిపారు.

ఘనంగా అన్న సమారాధన

గండేపల్లి: మల్లేపల్లి శివారు జాతీయ రహదారిని అనుకుని ఉన్న గుండాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం భారీ అన్న సమారాధన జరిగింది. అమ్మవారి 12వ వార్షిక జాతర మహోత్సవం సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామస్తులతో పాటు, వాహనదారులు, ప్రయాణికులు, వివిధ గ్రామాల ప్రజలు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని, అన్న ప్రసాదాలు స్వీకరించారు.

గట్టెక్కిన రైతన్న

ఒకప్పుడు వ్యవసాయం అంటేనే అన్నదాతకు క్షణక్షణం భయంభయంగా ఉండేది. ప్రకృతి కరుణిస్తుందో.. లేదో.! సాగు నీరందుతుందో.. లేదో.! పంట ఎండిపోకుండా బోరు వేద్దామంటే కరెంటు ఉంటుందో.. లేదో.! చివరకు వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు దొరుకుతాయో.. లేదో.! ఎలాగోలా చేతికందిందనుకున్న పంటకు గిట్టుబాటు ధర దొరుకుతుందో.. లేదో.! ఇంకా ఎన్నో.. ఎన్నెన్నో అడ్డంకులూ.. అవరోధాలు తప్పవి కావు. రైతన్నలు ఎదుర్కొంటున్న బాధలను గత టీడీపీ ప్రభుత్వం కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టాక.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతకు.. నేనున్నానంటూ భరోసా ఇచ్చి, వ్యవసాయాన్ని పండగలా మార్చేశారు. రైతులు దేనికీ కష్టపడకుండా, వారి చెంతకే సాగుకు అవసరమైన విత్తనాల మొదలు పండిన పంట కొనుగోలు వరకూ అంతా సరళతరం చేశారు. ఎరువుల కోసం టీడీపీ ప్రభుత్వ హయాంలో క్యూలో చెప్పులు పెట్టుకునే పరిస్థితి నుంచి, వారి గ్రామాల చెంతకే టన్నులకు టన్నులు ఎరువుల నిల్వలను జగనన్న అందుబాటులో ఉంచారు.

- ఆర్బీకేలతో తీరిన ఎరువుల కష్టాలు
- తుని సబ్ డివిజన్‌లో వంద కేంద్రాల్లో 2,662 టన్నుల నిల్వలు
- స్థానికంగా అందుబాటులో ఉంచిన ప్రభుత్వం

తొండంగి: వ్యవసాయానికి అవసరమైన ఎరువుల కోసం టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతులు మండల కేంద్రాల్లోని వ్యవసాయ శాఖ గోడౌన్లకు వెళ్లి అష్టకష్టాలు పడేవారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతుల కష్టాలను తీర్చేందుకు ప్రతి గ్రామంలోనూ రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)లను ఏర్పాటు చేసి, గ్రామంలోనే రైతులకు వ్యవసాయానికి అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందిస్తోంది. దీంతో రైతుల ఇబ్బందులు తీరాయి. ఈ నేపథ్యంలో రబీలో వరి, అపరాల సాగు పంటలు ఈ ఏడాది కూడా ఆశాజనకంగా ఉన్నాయని రైతులు సంబర పడుతున్నారు.

వంద ఆర్బీకేల ద్వారా..

వరిసాగులో సాగునీరు, వాతావరణ ప్రభావాలతో ఖరీఫ్ కంటే రబీలోనే అధికంగా రైతులు ఎరువులను వినియోగిస్తారు. దీంతో యూరియా, డీఏపీలకు డిమాండ్ అధికంగా ఉంటుంది. గతంలో రబీ వస్తుందంటే ఎరువులకు ఎన్ని ఇబ్బందులు పడాలో అన్న ఆందోళన ఉండేది. గత ప్రభుత్వాల హయాంలో వ్యవసాయ శాఖ ద్వారా మండల కేంద్రాల్లోనే గోడౌన్లలో ఎరువులు నిల్వ ఉంచి, రైతులకు సరఫరా చేసేవారు. కొన్నిచోట్ల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ఆధ్వర్యంలోనూ ఎరువులు సరఫరా అయ్యేవి. ఈ క్రమంలో సామాన్య రైతులకు అవసరమైన ఎరువులు అందని పరిస్థితి ఉండేది. దీనికితోడు ప్రైవేటు వ్యాపారులు కృత్రిమ కొరతను సృష్టించి, బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయించడంతో రైతులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆధికారంలోకి వచ్చాక, గ్రామాల్లోనే రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను అందించేందుకు గ్రామ సచివాలయ, ఆర్బీకేల వ్యవస్థ ఏర్పాటు చేసింది. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో తుని సబ్ డివిజన్ పరిధిలో తొండంగి మండలంలో 26, తుని మండలంలో 26, శంఖవరం మండలంలో 16, రౌతులపూడి మండలంలో 17, కోటనందూరు మండలంలో 15 మొత్తం 99 ఆర్బీకేలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ ఏడాది రబీలో ఇప్పటి వరకూ తొండంగి మండలంలో 751 టన్నులు, తునిలో 590, కోటనందూరులో 575, రౌతులపూడిలో 469, శంఖవరంలో 277.. మొత్తం 2,662 టన్నుల ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచినట్టు తుని ఏడీఏ సుంకర బుల్లిబాబు తెలిపారు. గ్రామాల్లోనే గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా రైతులు కోరిన వెంటనే ఆర్బీకేల ద్వారా ప్రభుత్వం ఎరువులను అందిస్తోంది. దీంతో సాగుకు మరింత ప్రోత్సాహంగా ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రబీలో 6,700 ఎకరాల్లో వరి, 1,740 ఎకరాల్లో మినప, పెసర తదితర అపరాలు సాగు చేశారు. ఆయా పంటలు ప్రస్తుతం ఎంతో ఆశాజనకంగా ఉన్నాయి.



తొండంగి మండలంలో ఆశాజనకంగా ఉన్న వరి పంట



తొండంగి మండలం సీతారాంపురం ఆర్బీకే వద్ద ఎరువుల లోడు దించుతున్న కూలీలు

751 టన్నుల ఎరువులు సిద్ధం



తొండంగి మండలంలో ఈ ఏడాది పంపా, పీబీసీ, వ్యవసాయ బోర్ల కింద 6,700 ఎకరాల వరకూ వరి సాగయ్యింది. ఆర్బీకేల ద్వారా ఇప్పటి వరకూ 751 టన్నుల యూరియా, డీఏపీ బస్తాలను సిద్ధం చేశాం. వీటిలో యాభై శాతం వరకూ రైతులు ఇప్పటికే తీసుకెళ్లారు. రెండో విడతలో కూడా వినియోగించేందుకు నిల్వలు అందుబాటులో ఉంచాం. రైతులు సద్వినియోగం చేసుకోవచ్చు.

– ఎస్.నరసింహం, మండల వ్యవసాయాధికారి, తొండంగి

ఆర్బీకేలతో రైతులకు ఎంతో మేలు



నాకున్న రెండెకరాల పొలంతో పాటు, మరో మూడెకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాను. గతంలో ఎరువుల కోసం ఎంతో ఇబ్బందులు పడేవాణ్ణి. ఇప్పుడు రైతు భరోసా కేంద్రంలోనే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అన్నీ అందుబాటులో ఉన్నాయి. రైతు భరోసా కేంద్రాలతో మా రైతులకు ఎంతో మేలు చేకూరుతోంది.

– మురాలశెట్టి రాంబాబు, రైతు, తొండంగి

జగన్ పాలనతోనే గ్రామ స్వరాజ్యం



కొమ్మనాపల్లిలో సచివాలయ భవనాన్ని ప్రారంభించిన దాడిశెట్టి రాజా

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- కొమ్మనాపల్లిలో అభివృద్ధి పనుల ప్రారంభం

తొండంగి: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతో సాధ్యమైందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. ఆదివారం కొమ్మనాపల్లి గ్రామంలో రూ.44 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, ఎస్సీపేటలో రూ.10 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం, రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన మల్టీపర్పస్ యుటిలిటీ భవనాలను మంత్రి ప్రారంభించారు. ముందుగా ఎస్సీపేటలో అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని గాంధీజీ గ్రామ స్వరాజ్య స్థాపన జరగాలని కలలుగన్నారన్నారు. దీనిని నూరు శాతం ఆచరణాత్మకంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా పాలన అందించి సాధించారన్నారు. ఒకప్పుడు గ్రామాల్లో ప్రజలకు విద్య, వైద్యం, వ్యవసాయ తదితర సంక్షేమ పథకాలు అందాలంటే మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, అయినా ఉపయోగం ఉండేది కాదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా గ్రామ సచివాలయాలు, గ్రామ వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలతో పాటు, స్థానిక సమస్యలు తీర్చేలా వ్యవస్థలను ఏర్పాటు చేశారన్నారు. విద్య, వైద్య రంగాలతో పాటు, వ్యవసాయ పరంగా రైతులకు కూడా మేలు జరిగేలా విలేజ్ క్లినిక్‌లు, ఆర్బీకేలు నిర్మించినట్టు పేర్కొన్నారు. గ్రామాభివృద్ధితో పాటు, ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఎంతో లబ్ధిని అందించారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా మరలా ఆయనను ముఖ్యమంత్రి చేసేలా సమష్టి కృషి చేయాలన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతున్న గృహ సారథి శివకోటి సునీల్‌ను పరామర్శించి, రూ30 వేల ఆర్థికసాయాన్ని అందించారు. అనంతరం రైతులు, గ్రామస్తులు పలు సమస్యలు తెలపగా, వాటిని తక్షణం పరిష్కరించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, ఎంపీడీఓ పసుపులేటి సతీష్, పార్టీ నాయకులు కొయ్యా మురళి, అంగుళూరి సుశీలరాణి, దడాల విజయ్, జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు గాబు రాజు, మండల కన్వీనర్ బద్ది నూకరాజు, కుర్రా శ్రీను, కోన సూర్యనారాయణ, సర్పంచ్ కోన అమ్మాజి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట



రాఘవపట్నంలో గిరిజనుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వరుపుల



సోషల్ మీడియా సభ్యులతో వరుపుల సుబ్బారావు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- రాఘవపట్నంలో గడప గడపకూ మన ప్రభుత్వం

రౌతులపూడి: రాష్ట్రవ్యాప్తంగా గిరిజనుల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజవర్గ కోఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం సబ్‌ప్లాన్ ఏజెన్సీకి చెందిన రాఘవపట్నం, జల్దాం పంచాయతీలకు సంబంధించి రాఘవపట్నంలో గిరిజనుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ చెన్నాడ సత్తిబాబు ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య నాయకుడు వాసిరెడ్డి జమీలు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ తాను శాసన సభ్యునిగా ఉన్న కాలంలో ఈ ప్రాంతానికి రోడ్ల నిర్మాణం, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు అందించినట్టు గుర్తుచేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో కుల, మత, వర్గ, రాజకీయాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు గడప వద్దకే సంక్షేమ పథకాలను అందించారన్నారు. పోడు భూములు సాగు చేస్తున్న అర్హులైన రైతులందరికీ పట్టాలిచ్చారని పేర్కొన్నారు. ఇంకా పోడు భూములు సాగు చేసే వారుంటే గుర్తించి, వారిక్కూడా భవిష్యత్తులో పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం గిరిజన యూనివర్సిటీని, మెడికల్ కాలేజీని విస్తరించారన్నారు. ప్రస్తుత సంక్షేమ పథకాలు కొనసాగాలంటే, మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాలని ఆయన కోరారు. మారుమూల కొండకోనల్లో నివసిస్తున్న వారికోసం పెద్దూరు, గిన్నిలారం గ్రామాలకు రోడ్ల సౌకర్యం కల్పించాలని మాజీ జెడ్పీటీసీ చెన్నాడ సత్తిబాబు కోరారు. తాగునీరు, రహదారుల నిర్మాణం, రవాణా సౌకర్యాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తొలుత వరుపుల సుబ్బారావు గ్రామ నడిబొడ్డు నుంచి స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాల వరకూ పాదయాత్రగా వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. గిరిజనులు పూలవర్షం కురిపించి ఆయనకు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. ఈ కార్యక్రమంలో శంఖవరం ఎంపీపీ పర్వత రాజుబాబు, జెడ్పీటీసీ గొల్లు చినదివాణం, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, మాజీ సర్పంచ్ చెన్నాడ బీమరాజు, యాదాల శ్రీను, ఎంపీటీసీ అయితా నాగరత్నం, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పోలుపర్తి తాతాజీ, సొసైటీ అధ్యక్షుడు రుత్తల సత్తిబాబు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి సైనికుల్లా పని చేయాలి

ఏలేశ్వరం: వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి సైనికుల్లా పని చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. లింగంపర్తి గ్రామంలో ఆదివారం ఆయన అధ్యక్షతన సోషల్ మీడియా సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరుపుల మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రి చేసేందుకు కృషి చేయాలన్నారు. లక్షలాది మందికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉపాధి కల్పించారన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలతో పాటు, మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అందజేశారని వివరించారు. వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారం చేపట్టడం ద్వారా అన్ని వర్గాలకూ మేలు జరుగుతుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వరుపుల సూరిబాబు, జెడ్పీటీసీలు బెహరా రాజ్యలక్ష్మి, గొల్లు చినదివాణం, ఎంపీపీలు పర్వత రాజబాబు, గోళ్ల కాంతిసుధాకర్, వాసిరెడ్డి జమీలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సొంత నిధులతో శ్మశాన అభివృద్ధి



శ్మశాన వాటిక అభివృద్ధికి భూమిపూజ చేస్తున్న వైస్ ఎంపీపీ, నాయకులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో దళితుల శ్మశాన వాటికను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా తన సొంత నిధులతో అభివృద్ధి చేస్తున్నట్టు వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు తెలిపారు. ఆదివారం శ్మశాన వాటిక అభివృద్ధికి భూమిపూజ చేశారు. నిధులు ఎంతైనా 850 మీటర్ల పొడవున ప్రహరీ నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఈ నెలాఖరుకు పనులు పూర్తి చేయనున్నామన్నారు. ఖననం చేసిన మృతదేహాలకు రక్షణ లేకపోవడంతో దళితులు ఆందోళన చెందారన్నారు. సమస్య తెలియడంతో యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని మంత్రి నిర్ణయించారన్నారు. జేసీఎస్ ఇన్‌చార్జి సకురు నాగేంద్ర నెహ్రూ, తుని ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్, నాయకులు గారా శ్రీనివాసరావు, కుసనం దొరబాబు, కీర్తి రాఘవ, రెడ్డి వీరబాబు పాల్గొన్నారు.

వైభవంగా నూకాలమ్మ తల్లి ప్రాణ ప్రతిష్ఠ

దర్శించుకున్న మంత్రి దాడిశెట్టి రాజా దంపతులు



నూకాలమ్మను దర్శించుకుంటున్న మంత్రి దాడిశెట్టి రాజా దంపతులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో పునర్నిర్మించిన ఆలయంలో నూకాలమ్మ అమ్మవారి ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఆదివారం ఉదయం 10.42 గంటలకు అమ్మవారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవం, 11.41 గంటలకు శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించారు. ఆలయాన్ని పునర్నిర్మించి, ప్రాణ ప్రతిష్ఠ చేసిన అమ్మవారిని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, లక్ష్మీచైతన్య దంపతులు దర్శించి, పూజలు చేశారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా యంత్ర విగ్రహ ప్రతిష్ఠ, బూరెలతో కుంభాభిషేకం, పూర్ణాహుతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాన్న సమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. పాత సంచుల వర్తక సంఘం, ఆలయ నిర్మాణ కమిటీ, గ్రామస్తుల పర్యవేక్షణలో కార్యక్రమాలు జరిగాయి. ఎస్.అన్నవరం గ్రామస్తులతో పాటు తుని, వల్లూరు, పాల్తేరు, కొత్త సూరవరం తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.

ఇర్రిపాకలో శివలింగం వద్ద సర్పం



ఇర్రిపాకలో ద్వాదశ జ్యోతిర్లింగాల వద్ద ఉన్న సర్పం

జగ్గంపేట: ఏలేరు నది ఒడ్డున ఇర్రిపాక గ్రామంలో కొద్ది రోజుల క్రితం ప్రతిష్ఠించిన ద్వాదశ శివలింగాల వద్ద ఓ సర్పం తారసపడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠాపన కొద్ది రోజుల క్రితం జరిగింది. శివరాత్రి రోజు ఇక్కడ కోటి మట్టి శివలింగాలతో మహా కుంభాభిషేకం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ ప్రాంతంలో రెండు తలల పాము రావడం, శివలింగాలను తాకుతూ తిరగడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఆలయ పూజారులు, భక్తులు అక్కడ పూజలు చేసి, సర్పానికి హారతులు ఇచ్చారు.

20న ఉచిత నేత్ర వైద్య శిబిరం

పెద్దాపురం: మండలంలోని క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో మంగళవారం తిరుపతి గ్రామంలో మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మందిర నిర్వాహకులు నంగిన శామ్యూల్ సుదీప్, వ్యవస్థాపకులు నంగిన సత్యానందం ఆదివారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మెగా వైద్య శిబిరం ఉంటుందన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిక



టీడీపీ నుంచి చేరిన కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ కండువాలు వేస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని: తొండంగి మండలం దానవాయపేటకు చెందిన 30 మంది టీడీపీ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి, వైఎస్సార్ సీపీలో చేరారు. ఆదివారం తుని మండలం ఎస్.అన్నవరంలోని మంత్రి కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా వారికి కండువాలు వేసి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై, మంత్రి దాడిశెట్టి రాజా నాయకత్వంలో పని చేసేందుకు వైఎస్సార్ సీపీలో చేరినట్టు వారు పేర్కొన్నారు. మేరుగు హరి, మడదా హేమంత్ ఆధ్వర్యంలో వారు చేరారు. పార్టీ బలోపేతానికి, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అత్యధిక మెజార్టీ సాధించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మంత్రి దాడిశెట్టి రాజా సూచించారు.

వైద్యం కోసం రూ.2 లక్షల సాయం



బాధితుడికి ఆర్థికసాయం అందజేస్తున్న గ్రామ పెద్దలు

జగ్గంపేట: కాట్రావులపల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న జగత దుర్గాప్రసాద్ కుమారుడు సిద్ధుకు వైద్యం చేయించేందుకు సేకరించిన రూ.2 లక్షల నగదును గ్రామ పెద్దలు ఆదివారం అందజేశారు. సుమారు ఏడాది నుంచి సిద్ధు మెదడు సంబంధ వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్య చికిత్స కోసం సుమారు రూ.8 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. ఈ నేపథ్యంలో కాట్రావులపల్లి గ్రామానికి చెందిన నాయకుడు ముసిరెడ్డి నాగేశ్వరరావు, బాధిత కుటుంబం కష్టాలను సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. దీంతో కాట్రావులపల్లితో పాటు, పలువురు యువకులు, వివిధ గ్రామాలకు చెందిన వారు రూ.1,81,900 పంపించినట్టు నాగేశ్వరరావు తెలిపారు. తనవంతుగా మరో రూ.20 వేలు కలిపి మొత్తం రూ.2,01,900లను బాధిత కుటుంబానికి గ్రామ పెద్దల సమక్షంలో అందించారు.

ఘనంగా దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

తొండంగి: రెండో వార్షికోత్సవం సందర్భంగా స్థానిక దుర్గమ్మ ఆలయం వద్ద ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు పసుపు నీటి బిందెలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. మెయిన్ సెంటర్‌లోని దుర్గామాత ప్రధానాలయంలో అమ్మవారిని అభిషేకించి, మొక్కులు తీర్చుకున్నారు.

అమ్మవారికి అభిషేకం చేసేందుకు పసుపు నీటి బిందెలతో ర్యాలీగా వెళ్తున్న మహిళలు



బషీర్‌బీబీ ఉర్సులో పాల్గొన్న ఎంపీ గీత



దర్గాలో ప్రార్థనలో పాల్గొన్న ఎంపీ వంగా గీత

కొత్తపల్లి: పొన్నాడలో జరుగుతున్న బషీర్‌బీబీ ఉర్సు ఉత్సవాలకు ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత హాజరయ్యారు. దర్గా దర్బార్‌లో ఆదివారం ముజావర్లు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కులమతాలకతీతంగా బషీర్ బీబీని భక్తులు దర్శించుకుంటారని, అనేక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో హాజరవుతారని చెప్పారు. చారిత్రాత్మకంగా బషీర్ బీబీ వారికి ప్రాధాన్యముందని, ఏడంతస్తులు ఉన్న ఈ దర్గా కాలక్రమంలో కూరుకుపోయినట్టు ఆధారాలు ఉన్నాయన్నారు. ఈ దర్గాను దర్శించుకుంటే మంచి జరుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసమన్నారు. స్థానికంగా తాగునీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. రానున్న వేసవిలో ప్రజలకు తాగునీరు సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కారే సుధ, వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు, కోఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, ఎస్సీ, ఎస్టీ డివిజన్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు పాల్గొన్నారు.